క్లుప్తంగా

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

కందుకూరు: మండల పరిధిలోని 16 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జెడ్పీటీసీ స్థానానికి గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ సరిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. అందుకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలకు ఐదు కౌంటర్లు, జెడ్పీటీసీకి ఒక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. 13వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేయవచ్చన్నారు. 14న పరిశీలన చేస్తామన్నారు. 15వ తేదీన సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చని వివరించారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రచురితం చేస్తామన్నారు. 23న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. నవంబర్ 11న కౌంటింగ్ ఉంటుందని చెప్పారు.

నేటి నుంచి బొడ్రాయి స్థాపన ఉత్సవాలు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో నూతన బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్టాపన మహోత్సవాలు గురువారం నుంచి ఆదివారం వరకు జరుగుతాయని కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్ దసరా ఉత్సవాల స్థలంలో ప్రతిష్టించేందుకు బొడ్రాయిని సిద్ధం చేశామని, గురువారం హయత్‌నగర్ గ్రామ వీధుల్లో ఊరేగింపు ఉంటుందని ఆయ న తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున విగ్రహ ప్రాణప్రతిష్టాపన చేస్తామన్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలని వినతి

ఇబ్రహీంపట్నం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో వివిధ రాజకీయ పక్షాల నేతల ఫ్లెక్సీలు తొలగించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికల కోడ్ అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బుగ్గ రాములు, భాస్కర్‌రెడ్డి, సురేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతిపితను అవమానించిన వారిపై చర్యలు తీసుకోండి

ఆమనగల్లు: మహాత్మాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు శ్రీకాంత్ భరత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలు కీర్తిస్తున్న మహాత్ముడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయనీయమన్నారు. శ్రీకాంత్‌భరత్‌ను అరెస్టు చేసిన కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వివాహిత ఆత్మహత్య

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు..ప్రకాశం జిల్లాకు చెందిన నర్సింహ్మ, సుధా(35) దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి సాహెబ్‌నగర్, మారుతినగర్‌లో నివాసముంటున్నారు. నర్సింహ్మ పనిమీద ఇంట్లో నుండి బయటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధా ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చూసేసరికి అప్పటికే సుధ మృతి చెందారు. భర్త నర్సింహ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ప్రశాంత్‌నగర్ అభివృద్ధికి చర్యలు

వనస్థలిపురం: ప్రశాంత్‌నగర్ కాలనీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో శ్రీ కనకదుర్గా దేవాలయం ముందు నుంచి నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలాజీనాథ్, కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, కాలనీ నాయకులు పద్మారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వికలాంగుల కార్పొరేషన్‌లో ఖాళీలు భర్తీ చేయాలి

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమశాఖ కార్పొరేషన్‌లో ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో ఆయన మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమ శాఖను స్వతంత్ర శాఖగా కొనసాగించాలని, 33 జిల్లాల్లో ఏడీ ఆఫీసులు తెరవాలని కోరారు. ఓహెచ్, రోస్టర్ పాయింట్ 10 లోపు మార్పుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. డ్రెస్ కోడ్ ఉద్యోగాలలో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. కార్పొరేషన్ ఎండీ శైలజ, చైర్మన్ ముత్తినేని వీరయ్య చొరవ చూపి అమలుకు సహకరించాలని కోరారు.

ఎల్లమ్మా.. నీ దర్శన భాగ్యం ఎలాగమ్మా!


నీటిలో నడుచుకుంటు ఆలయానికి వెళ్తున్న భక్తులు

- నీట మునిగిన రావిర్యాల–సర్దార్‌నగర్ మార్గం
- సూర్యగిరి అమ్మవారి దర్శనానికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న భక్తులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి దర్శనానికి భక్తులు నానా పాట్లు పడుతున్నారు. నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు రావిర్యాల–సర్దార్‌నగర్ మధ్య చెరువులోకి భారీగా వరద చేరింది. దీంతో ఆలయానికి వెళ్లే మార్గం కిలోమీటర్ మేర నీట మునిగింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రెండు కిలోమీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపి భక్తులు నీటి నుంచి నడుచుకుంటూ వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ప్రతీ మంగళవారం స్థానికులతో పాటు నల్గొండ, మహబూబ్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఎల్లమ్మ తల్లి దర్శనానికి వస్తుంటారు. దీంతో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది.

అధికారుల అలసత్వం

2020 నుంచి ఇప్పటి వరకు మూడు పర్యాయాలు ఈ మార్గం నీట మునిగింది. దీంతో భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అప్పటికప్పుడు అధికారులు కంకర పరిచి హడావుడి చేస్తున్నారు. హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు మినహాయిస్తే శాశ్వత పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖకు ఆలయ నుంచి రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా భక్తుల ఇబ్బందులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. గత మంగళవారం నగరానికి చెందిన దంపతులు అమ్మవారి దర్శనానికి వెళ్తూ ప్రమాదానికి గురైన విషయం పాఠకులకు విదితమే.

విపక్షాల పరస్పర ఆరోపణలు

ఈ నెల 7వ తేదీన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అమ్మవారికి ఆలయానికి వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్, ఇరిగేషన్, దేవాదాయ శాఖ అధికారులు హిందూ ఆలయాలపై చిన్నచూపు తగదన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి సైతం రోడ్డు అభివృద్ధిని మరిచారని విమర్శించారు. దీంతో బుధవారం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే సబితారెడ్డి రెండు నెలల క్రితమే రోడ్డు పరిశీలించారని.. రోడ్డు విస్తరణకు రూ.2.5 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. అధికార పార్టీని నిలదీయకుండా ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదన్నారు. దీంతో ఈ విషయం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ఓటు చోరీతోనే కేంద్రంలో అధికారం


అమీర్‌పేట్‌లో ఓటు చోరీపై సంతకాల సేకరణలో పాల్గొన్న కేఎల్లార్, తీగల అనితారెడ్డి తదితరులు

మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్

మహేశ్వరం: ఓటు చోరీకి పాల్పడి కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీకి అనుబంధ సంస్థగా పనిచేస్తోందని విమర్శించారు. అనంతరం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఓటు చోరీ తీరును వివరిస్తూ అన్ని ఆధారాలు చూపినా ఈసీ నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఓటు చోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్, ఏఎంసీ చైర్మన్ కృష్ణా నాయక్, వైస్ చైర్మన్ సీహెచ్.యాదయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, శివగంగ ఆలయ చైర్మన్ కుమార్, ఎస్టీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, బీసీ సెల్ మండల కోఆర్డినేటర్ కుమార్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య, అంజయ్య ముదిరాజ్, రాజు, మురళీధర్‌రెడ్డి, రఘుపతి, శివ, హరినాథ్‌గౌడ్, చంద్రమోహన్, రాజేందర్, ప్రసాద్, విఠల్ నాయక్, పాండు నాయక్, బాల్‌రాజ్, పాండు ముదిరాజ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డిని విమర్శించడం సరికాదు

బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

బడంగ్‌పేట్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని విమర్శించే స్థాయి అందెలకు లేదని, ఓడిపోయాననే బాధతో ఏదోదో మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న నాయకులను ప్రశ్నించకుండా.. ప్రతిపక్షంలో ఉన్న సబితారెడ్డిపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ప్రకృతి విలయతాండవానికి ఆదిబట్లలోని సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డు వరకు చెరువు వరదనీరు వచ్చి చేరితే, ఎడతెరపి లేకుండా విస్తృతంగా కురుస్తున్న వరదతోనే అనే విషయాన్ని పక్కన పెట్టి కావాలనే కక్షసాధింపు దిశగా మాట్లాడటం మంచిది కాదని అందెల శ్రీరాములును విమర్శించారు. మళ్లీ అధికారంలోకి వస్తే 100 ఫీట్ల రోడ్డు వేస్తామన్న మాట వాస్తవమే. కానీ అధికారంలోకి రాలేదు కదా అని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదని మండిపట్టారు. ఆలయాలు, మతం తప్పా వేరే మాట మాట్లాడని అందెల ఇప్పుడు కూడా భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. పలుమార్లు సబితా చేతిలో చిత్తుగా ఓడిన ఆయన ఆమెపై కక్షసాధింపు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. సబితా రెడ్డిపై విరర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, సుర్జగంటి అర్జున్, ఆనంద్ రెడ్డి, బొర్ర మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

గత ప్రభుత్వ పథకాలతోనే నేటికీ లబ్ధి

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు కాలేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి


మీర్‌ఖాన్‌పేటలో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడిచినా ఇచ్చిన 420 హామీలలో ఏ ఒక్కటి అమలు కాలేదని ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో గడప గడపకు కాంగ్రెస్ బాకీ కార్డుల కార్యక్రమంలో పాల్గొని బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ పథకాలతోనే ప్రజలు ఇప్పటికీ లబ్ధి పొందుతున్నారన్నారు. ఫ్యూచర్‌సిటీ పక్కనే ఉన్న మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ఎందుకు నిలిపివేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ కళాశాల ఏర్పాటైతే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందేదన్నారు. మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు విస్తరణ చేపట్టిన రహదారిని మధ్యలోనే నిలిపేశారని మండిపడ్డారు. అంతకుముందు మీర్‌ఖాన్‌పేట రహదారితో పాటు మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎస్‌టీఆర్‌తండాలో ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దనే కోలుకుంటున్న మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్ నాయక్‌తో పాటు శ్రీనునాయక్ చిన్న కుమారుడిని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, డి.చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్ రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ జ్యోతిశేఖర్‌గుప్తా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాకి రాములు, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిరదేవేందర్, డైరెక్టర్ పి.ఆనంద్, లచ్చానాయక్, కుమార్, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పారిజాతం, దేవీలాల్‌నాయక్, రామకృష్ణ, దామోదర్‌గౌడ్, జి.సామయ్య, శివప్రసాద్‌చారి, మాజీ సర్పంచ్‌లు పరంజ్యోతి, జంగయ్య, బాలకృష్ణ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తథ్యం

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి ఖాయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని లక్ష్మీ నర్సింహ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని.. ఆ తరువాత వాటి అమలును మరిచిందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను చట్టప్రకారం చేయకుండా ఆర్డినెన్స్ తీసుకువచ్చి ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజితారెడ్డి, జీఎల్ఎన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమార్, పంతునాయక్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రఘు, సయ్యద్ ఖలీల్, రమేశ్‌నాయక్, సాయిలు తదితరులు ఉన్నారు.


ఇబ్రహీంపట్నంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: సుమారు మూడున్నర గంటల పాటు ఇబ్రహీంపట్నం అంధకారంలో కూరుకుపోయింది. బుధవారం సాయంత్రం సుమారు 4 గంటల నుంచి రాత్రి 7.25 గంటల మధ్య విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వర్షంతో పాటు విద్యుత్ సరఫరా అంతరాయంతో వినియోగదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. స్థానిక విద్యుత్ అధికారిని పశ్నించగా సబ్‌స్టేషన్‌లో ఓ పరికరం(సీటీ) పేలినందున విద్యుత్ సరఫరా నిలిపివేశామని తెలిపారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎంపీడీఓ వెంకయ్య
- వివిధ శాఖల అధికారులతో సమావేశం

శంకర్‌పల్లి: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నార్సింగి ఏసీపీ రమణగౌడ్, మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబుతో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనుమతి లేని బ్యానర్లను తొలగించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు, ఏర్పాట్లపై నార్సింగి ఏసీపీ రమణగౌడ్ అధికారులకు వివరించారు. ఎన్నికల విధుల్లో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. సమావేశం తర్వాత ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, ఎంపీఓ గిరిరాజు, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, మోకిల సీఐ వీరబాబు, పంచాయతీరాజ్ ఏఈ నందకిశోర్, ఎన్నికల సిబ్బంది, పంచాయతీ ఆఫీసర్స్, కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఏసీపీ రమణగౌడ్, ఎంపీడీఓ వెంకయ్య, అధికారులు

రాకేశ్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలి


బాలాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న వామపక్ష నాయకులు

మీర్‌పేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాలాపూర్ మండల వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై రాకేశ్ కిషోర్ అనే వ్యక్తి దాడి చేయడం అప్రజాస్వామిక చర్య అని, ఇది దేశంలోని న్యాయ వ్యవస్థతో పాటు రాజ్యాంగం, యావత్ సమాజంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం కార్యదర్శి ఎం.యాదయ్య, కొల్లూర్ భీమేశ్, సీఐటీయూ నాయకులు దాసరి బాబు, జాటోత్ రెడ్యానాయక్, శేఖర్ యాదవ్, యాదమ్మ యాదవ్, ఛత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు


మాట్లాడుతున్న శ్రీనివాసులు

షాద్‌నగర్: పౌష్టిక విలువలతో కూడిన తీసుకుంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని నెహ్రూనగర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీలో చిన్నారులు, బాలింతలకు పోకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగవగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని పంపిణీ చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, చిరుధాన్యాలు, గుడ్లు, పాలు విధిగా ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. చిన్నారులకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. అదేవిధంగా గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసూతి చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఆయా కళావతి, ఏఎన్ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చి న్యాయం చేయండి


గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో సోలిపేట్ గ్రామస్తులు

సోలిపేట్ భూబాధితులు

షాబాద్: కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం మా భూములను తీసుకొని నష్టపరిహారం ఇవ్వలేదని, న్యాయం చేయాలని సోలిపేట్ రైతులు కోరారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. కొన్ని సంవత్సరాల క్రితం గత ప్రభుత్వం చందనవెల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 190లోని సోలిపేట్ రైతుల భూములను తీసుకుందని తెలిపారు. కానీ మాకు పూర్తిగా నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని కోరారు. రైతులకు భూమి గానీ, ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తానని మధుసూదన్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, కుమ్మరి విఠల్, నరేందర్, సునంద తదితరులు ఉన్నారు.

వాచ్‌మెన్లతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారు


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు చంద్రమోహన్

చైతన్యపురి: సెక్యూరిటీ, వాచ్‌మన్‌లకు తక్కువ వేతనాలు ఇస్తూ వారితో వెట్టిచాకిరి చేయిస్తున్నారని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ప్రైవేట్ అపార్టుమెంట్స్ సెక్యూరిటీ అండ్ వాచ్‌మన్ యూనియన్ రంగారెడ్డి జిల్లా మహాసభలు మల్లెపాక వీరయ్య అధ్యక్షతన దిల్‌సుఖ్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. చంద్రమోహన్ మాట్లాడుతూ..సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మన్‌లకు కనీసం రూ. 26వేల జీతం ఇవ్వాలని,అపార్టుమెంటు యాజమాన్యాలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు

కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కృష్ణానగర్ కాలనీలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ ఆటో సిబ్బంది ఇంటింటి చెత్త సేకరణలో అలసత్వం వహిస్తున్నారని.. ఇటీవల ఈ ఫిర్యాదులు పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసుల తనిఖీలు ప్రారంభం


వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ కిషన్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్: పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోలీసుల తనిఖీలు ప్రారంభమయ్యాయి. బుధవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. చేవెళ్ల నుంచి నగరంవైపు వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎవరూ రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు దగ్గర పెట్టుకోవద్దని, ఉంటే సీజ్ చేస్తామన్నారు. ప్రజలను అప్రమత్తత చేయడంతో పాటు నేరాలను అరికట్టేందుకే తనిఖీలు చేస్తున్నామని.. వాహనదారులు, ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నర్సింహారాజు, కిషన్‌జీ, నయీమొద్దీన్, కానిస్టేబుళ్లు ఉన్నారు.